


కవిగారు షేవింగు చేసుకుంటుంటే మీసంలో తెల్లవెంట్రుక దర్శన మిచ్చింది. మీ వయస్సెంత? తుమ్మెద రెక్కల్లాటి నల్లని మీసంలో తెల్ల వెంట్రుక చోటు చేసుకున్నందుకు ఆ మహాత్ముడు మనసు పాడుచేసుకున్నాడు. ముసలితనం అకస్మాత్తుగా మీదపడి పోయినట్టు భావించి గొప్ప వర్రీ అయిపోయేడు. కవిగారి మనస్సు కలతపడినా, కులాసాగా, వున్నా కవిత్వమే వస్తుంది. ఆ రూలు ప్రకారం ఆయన తెల్లవెంట్రుకమీద కావ్యమొకటి రాసి తెలుగుదేశానికి అందించారు.

నల్లవెంట్రుక తెల్లబడితే ముసలితనం స్వాగతం పలికినట్లు గమనించాలి. కుర్రతనానికి తెరపడిపోయిందని చెప్పుకోవాలి. ఏతనానికీ భయపడను

గాని, ముసలి తనానికి మాత్రం దూరంగా వుండాలని కోరుకుంటాను. ముసలి తనం ముదిరిపోతే నడుం వంగుతుంది. నడిచేందుకు శక్తి వుండదు. కర్ర సాయం కావాలి. శరీరం ముడతలు పడుతుంది. పళ్ళు రాలిపోతాయి. కళ్ళకి పవరు తగ్గిపోతుంది. దవడలు పీక్కుపోతాయి. మాట తడబడుతుంది. మానసికంగా కృంగిపోతాం. వయస్సులో వున్నప్పుడు పులిలాగా బతుకుతాం. సొంత పిల్లలు సైతం అదిరి చచ్చేలా రాజ్యంచేసి వుంటాం.

అల్లాంటిది ముసలితనంలో మన పవరు తగ్గిపోవడం వల్ల మన వాళ్ళకీ, మనవళ్ళకీ మనం ఆప్టరాలై పోతాం. మన సలహాలు వాళ్ళెవరికీ రుచించవు. మనం ఏమి మాట్లాడినా సోది అంటారు. నోర్మూసుకుని పడి వుండమని విసుక్కుంటారు. ప్రతి విషయంలోనూ జోక్యం కల్పించుకోవద్దని కోప్పడతారు. పిల్లలు బుద్ధిమంతులైతే వేళకింత తిండిపెట్టి బేటా యిస్తారు. రాక్షీ వెధవలైతే ఈ ఏర్పాటు కూడా వుండదు. రోజు సమానం హింసిస్తారు. ముసలితనంలో ఎవరి పీడనో బతకాలి. గనుక వాళ్ళెట్లా అఘోరించినా, ఏ విధంగా మనసుని గాయపరచినా చచ్చినట్లు సహించాలి.

ఈ కారణాల మూలంగా తెల్లవెంట్రుకల మీద నేను అపారమైన భయాన్ని పెంచుకున్నాను. ఈ మధ్యనే నా తల ముగ్గు బుట్ట అయ్యింది. తలంటుకుని నూనె రాసుకోకుండా అద్దంలో చూసుకుంటే అదిరి చచ్చిపోతున్నాను. వయసు ముదిరి తల తెల్లబడితే కాలధర్మమని సరిపెట్టుకోవచ్చు. నా ఈడు వాళ్ళు ఈ దేశంలో యింకా పెళ్ళిళ్ళు చేసుకుంటూనే వున్నారు. పొరుగు దేశాల్లో పెళ్ళికి వాయిదాలు వేస్తూ లవ్ డ్యూయేట్లు పాడుకుంటున్నారు. అప్పుడే నా తల ఎందుకుపండాలి? పండి నన్నెందుకు భయపెట్టాలి? భయమొక్కటే కాదు, వీధిలోకి వెళ్ళాలంటే చచ్చేంత సిగ్గు పడున్నాను. పది మందిలో తిరగడానికి మొహం చెల్లడంలేదు.

ఆ మధ్య చీరాల బస్టాండులో గొప్ప అవమానం జరిగిపోయింది. బస్సుకోసం నిలబడ్డాను. నాకొంచెం దూరంలో పాతికేళ్ళ పడుచు పెట్టె బేడాతో నిలుచునివుంది. చంకన పసిబిడ్డ వున్నాడు. చేతిలో మరచెంబు

వుంది. మరచెంబులో నీళ్ళు లేవు కాబోలు. తాను వెళ్ళి నీళ్ళు పట్టుకొస్తే ఈలోగా పెట్టె, బేడాని ఎవడైన సరిచేయగలడని ఆమె భయం. అంచేత నీళ్ళు పట్టుకొచ్చే ధర్మాత్ముడికోసం ఆమె కళ్ళు వెతుకుతుండగా నేను కని పించేను.

ఆడబిడ్డకి సాయం చేయడంలో తప్పులేదు. కాని ఆమె నన్ను పలకరించిన తీరు నన్ను బాగా వర్రీ చేసింది. అన్నగారూ అంటే ఎంతో సంతోషించేవాణ్ని. వరసలు వద్దనుకుంటే నీళ్ళు పట్టుకొస్తారాని సింపులుగా అడిగినా బాధపడేవాణ్నికాదు. తాతగారూ అని పిలిచింది. ఆ తర్వాత నీళ్ళు కావాలని అడిగింది. ఆ పిల్ల కంటికి నేను తాతలాగా కనిపించినందుకు నా తలని తక్షణం నరుక్కోవాలనిపించింది. నన్నింత అవమానించిన తల వుంటేనే....వూడితేనే. ఆ పిల్ల వేపు ఎంతో కోపంగా చూసేను. తాత అని పిలిచినందుకు చెంప పగలగొట్టాలన్నంత కోపం వచ్చింది. సభ్యత కాదు గనక నా కోపాన్ని దిగమింగుకుని అక్కడ్నించి పారిపోయేను.

కలకత్తా మెయిల్లో సుందరం వస్తున్నాడని తెలుస్తే చూద్దామని చెప్పి స్టేషన్‌కి వెళ్ళేను. భార్యా, ముగ్గురు పిల్లల్తో ప్లాట్‌ఫారం మీద అడుగు పెట్టేడు సుందరం. వాళ్ళ పిల్లలకు మావగా నన్ను పరిచయం చేసేడు సుందరం. పెద్దపిల్లలిద్దరూ ఆ బంధుత్వానికి అంగీకరించేరు. చంటిపిల్లకు మాత్రం నా తెల్లజుత్తు చూసేసరికి మావని కాదని డవుటు కలిగింది. 'మావ కాదు తాత' అన్నది. తప్పమ్మా మావ అని సలహా యిచ్చింది వాళ్ళమ్మ. మళ్ళా తాత అనేదా పిల్ల. ఈ వరసకి నేను బిక్కమొకం పెట్టేసేను. సుందరం పకపకా నవ్వేసేడు. వాడు నా ఈడువాడు. వాడి జుత్తు తెల్లబడ లేదు. అదొక్కటే మామధ్య డిఫరెన్సు. వాడి బిడ్డ నన్ను తాత అని పిలిచి నందుకు బాధపళ్ళేదు గాని, వాడు నవ్వుతుంటే నాకు వళ్ళు మండి పోయింది.

యువ రచయితలకీ, యువ గాయకులకీ, యువ దర్శకులకూ, నిర్మాత లకూ గ్లామరెక్కువ. ఈ యువ అనే బిరుదు ఎంత ఎంత వయస్సు వరకూ

చెల్లుబడి అవుతుందో నాకు తెలీదు. ఏ వృత్తిలో వున్నా దాని ముందు యువ అనేపదం తగిలిస్తే అదో హోదా. ఒక థ్రిల్లు, అంతేగాని ఎవ్వరు కూడా వృద్ధ రచయిత, వృద్ధ గాయకుడూ వృద్ధ వగైరా వగైరా అని పిలిపించుకునేందుకు యిష్టపడరు. ఆ మాటకొస్తే నిన్న మొన్నటి వరకూ యువ రచయితగానే పిలిపించుకున్నాను. ఎటొచ్చీ నెత్తిమీదజుత్తు తెల్లబడిం తర్వాత ఆ బిరుదుకి దూరమయిపోయాను. నా కంటే పెద్దవాడు ఒక రచయిత వున్నాడు. నలభై దాటినా, యిప్పటికీ అతను పాతికేళ్ళ కుర్రాడిలా వుంటున్నాడు. ఇప్పటికీ యువ రచయితగానే చెలామణీ అవుతున్నాడు. ఏమిటీ రహస్యమని అడిగేను. తలకి రంగు వేసుకుని జాగ్రత్త పడున్నానని చెప్పేడు.

రంగు వేసుకున్నాడు గనుకనే అతను పత్రిక్కల్లోకి రావడానికి జంకడంలేదు. బస్టాండులో గాని, రైల్వే ప్లాట్ ఫారమ్మీద గాని ఆడపిల్లలు కనిపిస్తే ధైర్యంగా వాళ్ళ పక్కన నిలబడుతున్నాడు. సినిమాకు వెళ్ళినప్పుడు ఇంటర్వెల్ లో కుర్రాళ్ళతోపాటు కాఫీలు, టీలు తాగుతూ కుర్ర జోకులు విసుర్తున్నాడు. అంతవరకూ బాగానే వుంది. మొన్నటికి మొన్న సాక్షాత్తూ అతగాడే నన్ను ముసలి కబుర్లు చెప్పకని కోపడ్డాడు. ఆ మాటకు నేనెంత దుఃఖపడ్డానో ఆ భగవంతుడికే తెలియాలి. నేను సైతం రంగువేసుకుని మార్కెట్లో విజృంభించాలని మొన్ననే ఒక నిర్ణయానికి వచ్చేను. రిజల్టు ఎట్లా వుంటుందో వేచి చూడాలి.